

ఎట్టకేలకు 'డీఎస్ఆర్' అమలు

డీఎస్ఆర్‌యాప్‌ను ఎట్టకేలకు అమలు చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు సిద్ధమయ్యారు. వివరాలు 8లో ▸



మోదీ పాలన స్వర్ణయుగం

మోదీ 11 ఏళ్ల పాలన స్వర్ణ యుగమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండెల లక్ష్మీనారాయణ అన్నారు. వివరాలు 8లో ▸



తొలి రోజే తెరుచుకోని బడి

పాఠశాలలు పునఃప్రారంభమైనా ఆ బడికి పట్టిన గ్రహణం మాత్రం వీడటం లేదు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వివేక్



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర కార్మిక, భూగర్భ గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి నియమితులయ్యారు. ఇప్పటివరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించిన కొండా సురేఖ స్థానంలో వివేక్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో ఆయనకు అమాత్య పదవి దక్కిన సంగతి తెలిసిందే. కేబినెట్‌లో బెర్త్ లభించిన వారంలోనే ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులు కావడం గమనార్హం.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): కాంగ్రెస్ పాలనలో ప్రజా సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం చేగుంటలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా పంచాయతీల పాలనను పట్టించుకోవడం లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరుగుతున్నాయని వాపోయారు. రామాయంపేటలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని బాధితుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుత సమయంలో పాఠశాలల నిర్వహణ, వర్షాకాలం సీజన్‌కు సంబంధించి సమీక్షలు నిర్వహించాల్సి ఉండగా, మంత్రులు జిల్లా వైపు తొంగిచూడకపోవడం విడ్డూరమన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా, ఓడిపోయిన వారు గ్రామాల్లో పర్యటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, రాజిరెడ్డి, విశ్వేశ్వర్‌రావు, జర్నల్‌సింగ్, యాదగిరి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీరామ్

చిన్నశంకరంపేట(మెదక్): సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ శ్రీరామ్ ఆదేశించారు. గురువారం నార్సింగి ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేఖ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టిజన్లకు న్యాయం చేయండి

నర్సాపూర్ రూరల్: ఆర్టిజన్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని ఆర్టిజన్ కార్మికుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు స్వామి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం మండలంలోని లింగాపూర్‌లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది నెలలుగా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈనెల 18న ఇందిరాపార్క్ వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదే రోజు సమ్మె నోటీసులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టిజన్ కార్మిక నాయకులు నర్సింగ్ రావు, సలహాదారు మహేందర్‌రెడ్డి, కో కన్వీనర్ నాగరాజు, జాయింట్ సెక్రటరీ సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మురళి, మీడియా కన్వీనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'బాలకార్మిక వ్యవస్థ సమాజానికి మచ్చ'

మెదక్ కలెక్టరేట్: బాల కార్మిక వ్యవస్థ ఇంకా కొనసాగడం సమాజానికి మచ్చలాందని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి హైమావతి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రపంచ బాల కార్మికుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఒక్క బాల కార్మికుడు ఉండకూడదని, పిల్లలను చదువు వైపు ప్రోత్సాహించాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

బల్దియాల్లో మాన్‌సూన్

కొనసాగుతున్న 100 రోజుల యాక్షన్‌ప్లాన్

- సెప్టెంబర్ 10 వరకు కొనసాగింపు
- జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, 75 వార్డులు

వానాకాలంలో ఎదురయ్యే సమస్యలను దృష్టిలో పెట్టుకొని మున్సిపాలిటీల్లో మాన్‌సూన్ పేరిట 100 రోజుల ప్రణాళికను ప్రభుత్వం రూపొందించింది. ఈనెల 2వ తేదీన యాక్షన్‌ప్లాన్ ప్రారంభం కాగా, సెప్టెంబరు 10వ తేదీ వరకు కొనసాగనుంది. ముందస్తుగా పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్తపై వార్డుల వారీగా అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

– మెదక్‌జోన్



మెదక్‌లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జిల్లాలో మెదక్, రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో 75 వార్డులు ఉండగా, రెండు లక్షల పైచిలుకు జనాభా ఉన్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దీంతో ముందస్తుగా దోమల నివారణతో పాటు కలుషిత తాగునీటితో వచ్చే వ్యాధులపై అధికారులు రోజుకో వార్డులో పర్యటిస్తూ విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. పట్టణాల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ప్రజలను భాగస్వాములను చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 62 రకాల అంశాలను 100 రోజుల్లో పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

వంద రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ప్రజారోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. వార్డుల్లో మురికి కాలువల పరిశుభ్రత, పిచ్చిమొక్కల తొలగింపు, తడి, పొడి చెత్తపై ప్రచారం, గుంతల్లో నీటి నిల్వ లేకుండా చూడటం, దోమలు వృద్ధి చెందకుండా యాంటీ లార్వా ద్రావణాన్ని పిచికారీ చేస్తున్నారు. మలేరియా, డెంగీ వ్యాధులు సోకకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వీధుల్లో రోడ్ల శుభ్రత, ఇళ్లలో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, కూలర్లలో నీటి నిల్వ లేకుండా చూడటం, పరిసరాల పరిశుభ్రతపై ముందుస్తుగా వివరిస్తున్నారు.

62 అంశాలపై కార్యాచరణ

మున్సిపాలిటీల్లో 62 అంశాలపై వంద రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించి, ఆ దిశగా అధికారులు ముందుకు సాగుతున్నారు. ఆయా బల్దియాల పరిధిలో పెంచుతున్న నర్సరీల్లో మొక్కల వివరాలు సేకరించి వార్డుల్లో, చెరువు కట్టలు, రోడ్లకు ఇరువైపులా నాటడం, ఇంజినీరింగ్ అధికారులు అభివృద్ధి పనులపై దృష్టి సారించడం, అత్యవసరమైన పనులకు వెంటనే టెండర్లు పిలిచి నిర్దేశించిన పనులను తగిన సమయంలో చేయించడం, మున్సిపాలిటీల అభివృద్ధి కోసం వార్డు అధికారులు ఇంటింటితో పాటు వివిధ రకాల పన్నులను ఎప్పటికప్పుడు వసూలు చేయటం, కొత్తగా వ్యాపారులకు లైసెన్స్‌లు అందించడం, వీధి వ్యాపారులకు రుణాలు ఇప్పించటం, వికలాంగుల కోసం ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం, మహిళలను మహిళా సంఘాల్లో చేర్పించటం, అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించి అవసరమైన వారికి కనెక్షన్ ఇవ్వటం లాంటి పనులు చేపట్టనున్నారు.

పక్కాగా అమలుచేస్తాం

ప్రభుత్వం నిర్దేశించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు చేస్తాం. ఇప్పటికే వార్డుల్లో పలు కార్యక్రమాలు చేపడుతున్నాం. ముందుగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ కార్యక్రమంలో ప్రజలను, మహిళా సంఘాల సభ్యులతో పాటు ఎన్‌జీఓలను సైతం భాగస్వాములను చేస్తున్నాం.

– శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ మున్సిపల్ కమిషనర్

భూభారతికి దరఖాస్తుల వెల్లువ

8 రోజులు.. • 216 సదస్సులు.. • 13,693 అర్జీలు



మెదక్ కలెక్టరేట్: భూ భారతి రెవెన్యూ సదస్సులకు జిల్లాలో రోజు రోజుకు ఆదరణ పెరుగుతోంది. ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయిన రైతులు కొండంత నమ్మకంతో తరలివస్తున్నారు. జిల్లాలోని 216 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, రైతులు తమ సమస్యలపై ఇప్పటివరకు 13,693 అర్జీలు సమర్పించారు. అయితే అత్యధికంగా అసైన్డ్ భూముల సమస్యలు, సర్వే నంబర్ మిస్సింగ్, సాదాబైనామాలు, పాస్ పుస్తకంలో తప్పులు వంటి సమస్యలపై అత్యధికంగా దరఖాస్తులు అందజేస్తున్నారు. ఇదిలాఉండగా రెవెన్యూ సదస్సులను కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్‌తో పాటు ఆర్డీఓలు సందర్శించి దరఖాస్తులు పరిశీలిస్తున్నారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ భరోసా కల్పిస్తున్నారు.

ఆరుగురు అధికారుల బృందం

జిల్లాలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో ఆరుగురు అధికారుల బృందం పాల్గొంటున్నారు. ఈ బృందంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారులు బృందంగా ఏర్పడి రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. రైతుల నుంచి వినతులు స్వీకరించి కేటగిరీల వారీగా విభజిస్తున్నారు.

హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

గ్రామాల్లో చాలా వరకు రైతులు నిరక్షరాస్యులుగా ఉండటంతో వారికి ఉపయోగపడేలా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఉచితంగా దరఖాస్తు పత్రాలు ఇవ్వడంతో వారి సమస్యను అక్కడే హెల్ప్‌డెస్క్ అధికారులు రాసిస్తున్నారు.

అంశాలు	అర్జీలు
అసైన్డ్ భూ సమస్యలు	2,639
సర్వే నంబర్ మిస్సింగ్	2,624
సాదాబైనామాలు	2,429
పీఓటీలు	2,014
పాస్‌పుస్తకంలో తప్పులు	964
ఓఆర్‌సీ	412
సక్సెషన్	435
మ్యూటేషన్ పెండింగ్	307
కొత్త అసైన్డ్ భూములు	246
ఫారెస్ట్, రెవెన్యూ సర్వే కోసం	164
ఇతర సమస్యలపై	1,459

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు అవసరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతులు, శాస్త్రవేత్తలు

నర్సాపూర్ రూరల్: ప్రతి రైతు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తగా ఉండాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ పద్మ, గీత, రంజిత, గాయత్రి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని రుస్తుంపేట, అద్మాపూర్‌లో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొని సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవాలన్నారు. రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకంతో మంచి దిగుబడి వస్తుందన్నారు. నర్సాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ అధికారి దీపిక తెలిపారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



మెదక్‌లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ కలెక్టరేట్/చిన్నశంకరంపేట(మెదక్): పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు వరమని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 311 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు పదేళ్లలో కుంటిసాకులతో కాలం వెళ్లదీశారే తప్ప ప్రజలకు చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. విద్యా, వైద్యం ప్రధాన అంశాలుగా తీసుకున్నామని చెప్పారు. రామాయంపేటలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ మాణిక్యం, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే చిన్నశంకరంపేట మండల కేంద్రంలో 420 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం వల్లూర్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను గురువారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజినీర్ బలరాం పరిశీలించారు. ఇంటిని పీఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానం గురించి పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు. కార్యక్రమంలో ఈఈ నాగభూషణం, గ్రామ కార్యదర్శులు అంజిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ చీఫ్ ఇంజినీర్ బలరాం



యూసుఫ్‌పేట పాఠశాలలో మంగళ హారతులు, పూలతో విద్యార్థులకు స్వాగతం

బడిగంట మోగింది

- తొలి రోజు హాజరు అంతంతే..
- విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ

మెదక్‌జోన్: బడిగంటలు గణగణ మోగాయి. వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు తెరుచుకున్నాయి. కొత్త విద్యా సంవత్సరం ఆరంభం అయింది. ఇంటి వద్ద ఆటాపాటలతో గడిపిన పిల్లలు బడిబాట పట్టారు. బడిలో అడుగుపెట్టగానే ఉపాధ్యాయులు పూలు అందించి ఘన స్వాగతం పలికారు. కాగా తొలిరోజు విద్యార్థులు అంతంత మాత్రంగానే పాఠశాలలకు వచ్చారు. చాలా చోట్ల ఉదయం ప్రార్థనలో ఉపాధ్యాయులే దర్శనం ఇచ్చారు. ఇదిలా ఉండగా విద్యాశాఖ అధికారులు చెప్పినట్టుగానే విద్యార్థులకు మొదటి రోజే పుస్తకాలు, యూనిఫాంలు అందించారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



కొడిపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న సుహాసినిరెడ్డి

కొడిపల్లి(నర్సాపూర్): పాఠశాల ప్రారంభమైన మొదటి రోజే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన కొడిపల్లి ఉన్నత, బాలికల ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి సొంతభవనం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలరాజు, హెచ్‌ఎంలు సాజిద్‌అలీ, పద్మజ, ఓంప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్కారు బడులపై నమ్మకం పెరిగింది



గాజులగూడెం పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈఓ రాధాకిషన్

పాపన్నపేట(మెదక్)/అల్లాదుర్గం/టేక్మాల్: ప్రభుత్వ పాఠశాలకు ప్రైవేట్ బడి నుంచి విద్యార్థులు రావడం కొత్త మార్పుకు నిదర్శనమని డీఈఓ రాధాకిషన్ అన్నారు. గురువారం పాపన్నపేట మండలం గాజులగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ బడులన్నీ ప్రజలయే అన్న విషయాన్ని గుర్తించి, ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ బడికి పంపాలని కోరారు. అధునాతన విద్యావిధానంతో పాటు చిన్నప్పటి నుంచే పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్నామని తెలిపారు. ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ విద్య అందిస్తున్నామని, కృత్రిమ విద్య సైతం అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ బాలాగౌడ్, సొసైటీ చైర్మన్ మల్లేశం, హెచ్‌ఎం సాయికుమార్, టీచర్లు రవీందర్ రెడ్డి, సాయిలు, వేణుగోపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి ఉన్నత పాఠశాలను సందర్శించారు. అలాగే అల్లాదుర్గం మండల పరిధిలోని ముస్లాపూర్ పీఎంశ్రీ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఈ ఏడాది యాసంగి సీజన్‌లో రికార్డుస్థాయిలో ధాన్యం కొను గోలు చేసినట్లు అదనపు కలెక్టర్ నగేష్ గురువారం తెలిపారు. జిల్లావ్యాప్తంగా 498 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఇప్పటివరకు 488 కొనుగోలు కేంద్రాల్లో పూర్తయినట్లు తెలిపారు. ప్రస్తుతం మరో 10 కేంద్రాల్లో కొంతమేర ధాన్యం మిగిలిఉందన్నారు. 80,045 మంది రైతుల నుంచి 3,19,460,480 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు చెప్పారు. ఇందుకుగానూ రూ.701 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. మరో 10 కొనుగోలు సెంటర్లలో మాత్రమే కొనుగోలు ముగింపుస్థాయిలో ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో భాగస్వామ్యం అవుతున్న ప్రతి అధికారిని అభినందించారు. ప్రభుత్వ ఆదేశాలు అమలు చేస్తూ రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తూ, గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక స్థాయిలో ధాన్యం సేకరించినట్లు పేర్కొన్నారు.

సదస్సులు సద్వినియోగం చేసుకోండి

చిన్నశంకరంపేట(మెదక్): భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ నగేశ్ సూచించారు. గురువారం మండలంలోని గవ్వలపల్లిలో రెవెన్యూ సదస్సును పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈసందర్భంగా తహసీల్దార్ మన్నన్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం నార్సింగి మండల కేంద్రంలోని రైతు సదస్సును పరిశీలించారు.

త్వరితగతిన సమస్యలు పరిష్కారం



రంగాయపల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్‌రాజ్

తూప్రాన్/మనోహరాబాద్(తూప్రాన్)/శివ్వంపేట(నర్సాపూర్): భూభారతి రెవెన్యూ చట్టంతో రైతుల సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం తూప్రాన్‌లోని రావెల్లి, మనోహరాబాద్ మండలంలోని రంగాయపల్లిలో రెవెన్యూ సదస్సును సందర్శించారు. ప్రతి దరఖాస్తును స్వీకరించాలని, వాటిని వెంటవెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 13,693 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆయన వెంట ఆర్డీఓ జయచంద్రారెడ్డి, తహసీల్దార్లు కృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణమూర్తి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. అనంతరం శివ్వంపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీకి తరగతి గదుల కొరత ఉండడంతో కలెక్టర్ పరిశీలించారు. కాలేజీకి సొంత భవనం లేకపోవడంతో ప్రస్తుతం శివ్వంపేట ఉన్నత పాఠశాలలో కొనసాగుతుంది. త్వరలోనే సమస్యను పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఆయన వెంట జిల్లా ఇంటర్ విద్యాధికారి మాధవి, తహసీల్దార్ కమలాద్రి, ఎంఈఓ బుచ్చనాయక్, ప్రిన్సిపాల్ శైలజ, హెచ్‌ఎం బాలచంద్రం ఉన్నారు.

37 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

జిల్లాలో 37 లక్షల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం ఐటీసీ పరిశ్రమలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలను నాటడమే కాకుండా సంరక్షించాలని సూచించారు. ఇందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చెట్లను నరికితే పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రకాశ్‌రావు, ఆర్డీఓ జయచంద్రారెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఎంఈఓ మల్లేశం, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ ఆదినారాయణ, ఐటీసీ ప్రతినిధులు, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

పోక్సో కేసులో నేరస్తుడికి పదేళ్ల జైలు

మెదక్‌ మున్సిపాలిటీ : బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తికి న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. రామాయంపేటకు చెందిన రొయ్యల రాజు(35) 2009 ఆగస్టు 27న వినాయక మండపం వద్ద ప్రసాదం తీసుకొని వెళ్తున్న ఆరేళ్ల బాలికను పాఠశాల చూపించడానికి రమ్మని తీసుకెళ్లాడు. అక్కడికి తీసుకెళ్లిన తరువాత బాలిక నోట్లో బట్టలు కుక్కి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ విజయ్‌కుమార్‌ పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్‌ చేశారు. ప్రస్తుత సీఐ వెంకటరాజాగౌడ్‌ జిల్లా కోర్టులో నిందితుడిని, సాక్షులను ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ, నిందితుడు రొయ్యల రాజుకు పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. నేరస్తుడికి శిక్షపడేలా కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

గంజాయి, మద్యం స్వాధీనం

మునిపల్లి(అందోల్‌): ఆర్టీసీ బస్సులో గంజాయి తీసుకొస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని కంకోల్‌ టోల్‌ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా కర్నాటకకు చెందిన ఆర్టీసీ బస్సులో మణి అనే వ్యక్తి దగ్గర 400 గ్రాముల ఎండు గంజాయి దొరికింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకున్నామని జిల్లా టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు, స్టేషన్‌ టీం, సిబ్బంది హనుమంతు, అనుదీప్‌రెడ్డి తెలిపారు. అలాగే గోవా నుంచి అక్రమంగా 5,190 లీటర్ల సుంకం చెల్లించని మద్యం తరలిస్తున్న వ్యక్తిని స్టేషన్‌కు తరలించారు. మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


శివకుమార్‌

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన చిలప్‌చెడ్‌ మండలం గంగారం గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ నర్సిహులు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మంగలి శివకుమార్‌కు నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 10న ఆస్పత్రికి వెళ్లి వచ్చాడు. 11న ఉదయం భోజనం చేసి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు ఫోన్‌ చేస్తే స్విచ్‌ఆఫ్‌ వచ్చింది. చుట్టు ప్రక్కల, బంధువుల వద్ద ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూతురు కనిపించడం లేదని తండ్రి ఆత్మహత్య


దుర్గయ్య

టేక్మాల్‌(మెదక్‌): కూతురు కనిపించకపోవడంతో మనస్తాపం చెందిన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన టేక్మాల్‌లో గురువారం చోటుచేసుకుంది. స్థానిక ఏఎస్సై కృష్ణ వివరాల ప్రకారం.. గ్రామానికి ఈర్నాల దుర్గయ్య (40) కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చిన్న కూతురు భాను ఊర్లోనే ఉంటూ చదువుకుంటోంది. ఈ నెల 7న మృగశిర కార్తె సందర్భంగా దుర్గయ్య గ్రామానికి వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం నుంచి భాను కనిపించలేదు. వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మనస్తాపానికి గురైన దుర్గయ్య ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు.

చికిత్స పొందుతూ గృహిణి మృతి

నర్సాపూర్‌ రూరల్‌: చికిత్స పొందుతూ గృహిణి మృతి చెందింది. ఎస్సై లింగం కథనం ప్రకారం... మండలంలోని మూసాపేట గ్రామానికి చెందిన ఆలంపల్లి సంధ్య (26) మానసిక వ్యాధితో బాధపడుతూ మందులు వాడుతుంది. ఈనెల 10న తాను వాడే మందులతో పాటు భర్త గిరి వాడే మూర్ఛ వ్యాధి మందులు అనుకోకుండా మింగింది. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు ఆమెను నర్సాపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌ గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది.

ఎట్టకేలకు డీఎస్‌ఆర్‌ అమలు

- గత నెల 24నుంచి అందుబాటులోకి
- ఫేస్‌ రికగ్నైషన్‌తో కార్యదర్శుల హాజరు
- పారదర్శక పాలన అమలుకు చర్యలు

మొదట యాప్‌ను నిరాకరించిన పంచాయతీ కార్యదర్శులు





సంగారెడ్డి జోన్‌: గ్రామ పంచాయతీల్లో పాలన పారదర్శకంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రోజువారీ పారిశుద్ధ్య నివేదిక (డీఎస్‌ఆర్‌– డైలీ శానిటేషన్‌ రిపోర్టు) యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌లో వివరాలు అప్‌డేట్‌ చేసేందుకు దూరంగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు ఎట్టకేలకు అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. గత నెల 24న ఈ విధానను అమలులోకి తెచ్చినా ఇప్పటి వరకు వివరాలు నమోదు చేయలేదు. జిల్లాలో వివరాలు నమోదు చేస్తున్న వారు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. ఇప్పటి కే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, ఏ శాఖలో లేని విధంగా తమకు ఫేస్‌ రికగ్నైషన్‌ యాప్‌ ఎందుకని పంచాయతీ కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు.

కొత్త మార్గదర్శకాలతో రూపకల్పన

గత ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల్లో పారదర్శకతను పెంచేందుకు ఈ యాప్‌ను రూపొందించింది. అందులో ఉన్న మార్గదర్శకాలతో పలువురు పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించకపోవటంతో పాటు విధులకు గైర్హాజరవుతున్నట్లు గుర్తించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం యాప్‌లో పలు మార్పులు చేస్తూ ఫేస్‌ రికగ్నైషన్‌తో హాజరుతో పాటు ఇతర వివరాలను నమోదు చేయాలని ఉత్వర్వుల్లో పేర్కొన్నది. ప్రతి రోజు సంబంధిత కార్యాలయానికి వెళ్లి ఫొటోతో ఫేస్‌ రికగ్నైషన్‌తో హాజరు వేయాల్సి ఉంటుంది. అంతే కాకుండా సేకరించిన చెత్త వివరాలను తూకం వేసి, ఎన్ని కేజీలు ఉందో వివరాలు అప్‌లోడ్‌ చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం జారీ చేసిన కొత్త మార్గదర్శకాలను అమలు చేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అంగీకరించని కార్యదర్శులు

ప్రభుత్వం తీసుకువచ్చిన యాప్‌ను మొదట పంచాయతీ కార్యదర్శులు వ్యతిరేకించారు. తెలంగాణ పంచాయతీ సెక్రటరీల అసోసియేషన్‌, తెలంగాణ పంచాయతీ సెక్రటరీ సెంట్రల్‌ ఫోరం, తెలంగాణ పంచాయతీ సెక్రటరీల ఫోరం.. ఈ మూడు సంఘాలు జేఏసీగా ఏర్పడి యాప్‌కు వ్యతిరేకంగా పోరుబాట చేపట్టారు. ఇప్పటికే తమ ఫోన్లలో ఇందిరమ్మ ఇళ్లు, స్వచ్ఛ భారత్‌, మిషన్‌ భగీరథ, ఆహారభద్రత కార్డులతో పాటు తదితర వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. కొత్తగా వచ్చిన యాప్‌తో మరింత భారం అవుతుందని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు.

జిల్లాలో 631 గ్రామ పంచాయతీలు

జిల్లాలోని 26 మండలాల్లో 631 గ్రామ పంచాయతీల్లో 631 మంది కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల మెరుగైన పారిశుద్ధ్యానికి జోన్‌లను ఆయా గ్రామాల్లో ఇండ్ల సంఖ్య, జననివాసం, మార్కెట్లు, ఇనిస్టిట్యూషన్‌, వ్యాపార సంస్థల ఆధారంగా జోన్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామపంచాయతీలో రెండు నుంచి ఆరు వరకు విభజించారు. ఈ మేరకు 1464 జోన్‌లను ఏర్పాటు చేశారు. యాప్‌ వినియోగం ద్వారా జిల్లాలో బుధవారం వరకు 15 గ్రామ పంచాయతీల్లో మాత్రమే అమలైంది. మిగితా 616 గ్రామ పంచాయతీలు అమలుకు దూరంగా ఉన్నాయి. గురువారం జిల్లా అంతటా యాప్‌ అమలు ప్రారంభమైంది. మొదటి రోజు జిల్లా అంతటా ఫేస్‌ రికగ్నైషన్‌ యాప్‌ ద్వారా హాజరు వేశారు. మిగితా వివరాలు సైతం నమోదు చేయనున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మోదీ పాలన స్వర్ణయుగం

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ

మెదక్‌జోన్‌: ప్రధాని మోదీ పదకొండేండ్ల పాలన స్వర్ణయుగమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నిజామాబాద్‌ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం మెదక్‌ బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ 6 దశాబ్దాల పాటు దేశాన్ని పాలించి చేసిందేమి లేదని విమర్శించారు. మహిళలు, విద్యార్థులు, యువకుల అభివృద్ధి కోసం మోదీ ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు తీసుకొచ్చారన్నారు. రోడ్డు, వాయు మార్గాలు, వందేభారత్‌ రైళ్లతో పాటు దేశ భద్రత విషయంలో ప్రపంచ దేశాలకు తెలిసి వచ్చేలా భారత్‌ సత్తాను ఆపరేషన్‌ సిందూర్‌ ద్వారా చూపించాడన్నారు. రైతు అభివృద్ధే ధ్యేయంగా రైతు పండించిన ఉత్పత్తులకు మద్దతు ధర, పెట్టుబడుల కోసం కిసాన్‌సమ్మాన్‌ నిధి అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్‌ మల్లేశంగౌడ్‌, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌, మేడ్చల్‌ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్‌ రెడ్డి, స్థానిక నేతలు ఎంఎల్‌ఎన్‌ రెడ్డి, సుభాష్‌గౌడ్‌, సత్యనారాయణ, రాములు, సతీష్‌, శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

మోటార్ల దొంగలు అరెస్ట్‌

కేసును ఛేదించిన రేగోడ్‌ పోలీసులు


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రేణుకా రెడ్డి

రేగోడ్‌(మెదక్‌): వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్లను దొంగిలిస్తున్న నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అల్లాదుర్గం సీఐ రేణుకా రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రేగోడ్‌ మండలంలోని పెద్దతండాకు చెందిన వడ్త్యా కిషన్‌ నాయక్‌, హరిజా నాయక్‌ నెల క్రితం ఆయా గ్రామాల్లో వ్యవసాయ బోరు మోటార్లను దొంగిలించారు. వాటికి ఉండే స్టాండ్‌లను కూడా ఎత్తుకెళ్లారు. అయితే కొండాపూర్‌ గ్రామానికి చెందిన పట్లోళ్ల శ్రీకాంత్‌ ఫిర్యాదుతో పాటు మొత్తం ఐదు కేసులు నమోదయ్యాయి. ఏఎస్‌ఐ శంకర్‌, కానిస్టేబుళ్లు వినోద్‌, సురేశ్‌, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించారు. రూ.70 వేల విలువైన ఐదు మోటార్లు, రెండు స్టాండ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించారు. ఏఎస్‌ఐ శంకర్‌, సిబ్బందిని సీఐ అభినందించారు.

ఆరెగూడెం చోరీ కేసులో..

వెల్దుర్తి(తూప్రాన్‌): మండలంలోని ఆరెగూడెంలో వారం రోజుల క్రితం జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఎస్సై రాజు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన హనుమాద్రి లక్ష్మాగౌడ్‌ ఇంట్లో ఈ నెల 5న చోరీ జరిగింది. ఇంటి తాళాలు పగులగొట్టి చెక్క పెట్టెలో దాచిన రూ.90 వేలు నగదును అపహరించారు. ఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా అదే గ్రామానికి చెందిన నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించాడు. దొంగిలించిన సొత్తులో ఖర్చుపెట్టుకోగా మిగిలిన రూ.23 వేలు నగదు, ఒక సెల్‌ఫోన్‌, దొంగతనానికి ఉపయోగించిన ఇనుప పైపును స్వాధీనం చేసుకున్నారు. గురువారం కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్‌ కస్టడీ విధించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

అదనపు కలెక్టర్‌ నగేశ్‌


ఉపాధ్యాయుడి కుమారుడు అమర్త్యాకు అడ్మిషన్‌ ఇస్తున్న అదనపు కలెక్టర్‌

హవేళిఘణాపూర్‌(మెదక్‌): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అదనపు కలెక్టర్‌ నగేశ్‌ అన్నారు. గురువారం మండల పరిధిలోని కూచన్‌పల్లి జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు నోట్‌, పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలలకు వచ్చి ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలు సరిగా అర్థం చేసుకొని బాగా చదువుకోవాలన్నారు. గ్రామంలో బడీడు పిల్లలందరూ కచ్చితంగా పాఠశాలలోనే ఉండాలన్నారు. ఎవరైనా రాకుండా ఉంటే వారిని గుర్తించి సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్‌ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. తెలుగు ఉపాధ్యాయుడు శశికుమార్‌ తన కుమారుడికి, ప్రైవేట్‌ పాఠశాలల్లో చదువుతున్న మరి కొంతమంది విద్యార్థులకు అదనపు కలెక్టర్‌ చేతుల మీదుగా అడ్మిషన్‌ తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో మధుమోహన్‌, పాధ్యాయులు శివరాజ్‌, సుకన్య, శ్రీనివాస్‌, మల్లారెడ్డి ,సందీప్‌, సంతోషికుమారి, వినోద్‌, కొండల్‌ రెడ్డి, రాజేందర్‌ రెడ్డి, రాజు, చక్రపాణి, కృష్ణవేణి , గంగమణి, సందీప్‌ రెడ్డి పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

మునిపల్లి(అందోల్‌): రోడ్డు దాటుతున్న వ్యక్తిని పరిశ్రమ బస్సు ఢీకొట్టడంతో మృతి చెందాడు. బుదేరా ఎస్‌ఐ రాజేశ్‌ నాయక్‌ వివరాల ప్రకారం... పెద్దచల్మెడ గ్రామానికి చెందిన చాకలి దుర్గయ్య (60) గురువారం ఉదయం గ్రామంలో పత్తి పంటకు మందులు కొనుగోలు చేయడానికి రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో ఎంఆర్‌ఎఫ్‌ పరిశ్రమలో లీజుకు నడిపిస్తున్న వాసవీ ట్రాన్స్‌పోర్ట్‌ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దుర్గయ్యకు బలమైన గాయాలు కావడంతో సదాశివపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దుర్గయ్య మృతి చెందాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌..

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని శనిగరం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అభిలాష్‌ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్‌ గాండ్ల లక్ష్మయ్య(56) గురువారం ఉదయం వాకింగ్‌ చేస్తుండగా అశోక్‌ లేలాండ్‌ వాహనం వెనక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటికుంటలో వ్యక్తి మృతదేహం

ములుగు(గజ్వేల్‌): నీటి కుంటలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం కనిపించింది. ఈ ఘటన ములుగు మండలం కొట్యాల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ కథనం ప్రకారం... గ్రామస్తులు గొల్లోల్ల మత్తడి కుంట సమీపంలో వెళ్తుండగా గుర్తు తెలియని మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని బయటకు తీసి గజ్వేల్‌ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. కాగా మృతుడి వయస్సు 50 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని, ఛామన చాయ రంగు, ఒడ్డుపై మాత్రం మెరూన్‌ రంగు గల షర్టు, నీలి రంగు డబ్బాల లుంగీ ఉన్నాయని తెలిపారు.

ఆనంద్‌ గార్డెన్‌ సమీపంలో...

నర్సాపూర్‌: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. స్థానిక ఎస్‌ఐ లింగం వివరాల ప్రకారం... నర్సాపూర్‌ – సంగారెడ్డి మార్గంలోని ఆనంద్‌గార్డెన్‌ సమీపంలో రోడ్డు పక్కన మృతదేహం కనిపించగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపర్చారు. అనారోగ్య సమస్యలతో చనిపోయి ఉంటాడని, మృతుడి వయస్సు 40 నుంచి 45 సంవత్సరాలు ఉండొచ్చని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి ఒంటిపై చొక్కా లేదని, నల్ల రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, కుడి చేతికి ఎర్ర రంగు ధారం ఉందని తెలిపారు.

సంగారెడ్డి పట్టణంలో..

సంగారెడ్డి క్రైమ్‌: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పట్టణ సీఐ రమేష్‌ వివరాల ప్రకారం ... స్థానిక మహబూబ్‌సాగర్‌ చెరువు కట్ట పరిసర ప్రాంతంలో గురువారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి(50) మృతదేహం ఉందని చాపలు పట్టే జాలరులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిందని, ఒంటిపై నీలం రంగు టీ షర్ట్‌, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

స్కూల్‌ బస్సులకు ఫిట్‌నెస్‌ తప్పనిసరి

ఎంవీఐ శంకర్‌ నారాయణ


స్కూల్‌ బస్సును పరిశీలిస్తున్న ఎంవీఐ శంకర్‌నారాయణ

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): పాఠశాలలు ప్రారంభమవడంతో ప్రైవేట్‌ స్కూల్‌ బస్సులకు ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్‌ తీసుకోవాలని సిద్దిపేట మోటారు వెహికిల్‌ ఇన్‌స్పెక్టర్‌ (ఎంవీఐ) శంకర్‌నారాయణ పేర్కొన్నారు. గురువారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో పలు ప్రైవేట్‌ పాఠశాలలకు చెందిన బస్సులకు ఫిట్‌నెస్‌ పరీక్షలు నిర్వహించి, సర్టిఫికెట్‌ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా స్పెషల్‌ డ్రైవ్‌లో భాగంగా స్కూల్‌ బస్సులను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్కూల్‌ బస్సులను తనిఖీ చేసి, డాక్యుమెంట్‌లను పరిశీలించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపితే చర్యలు తప్పవన్నారు. పరిమితికి మించి వాహనాల్లో విద్యార్థులను తరలించకూడదని సూచించారు. బస్సుల కండీషన్‌, ఫస్ట్‌ ఎయిడ్‌ బాక్సులు, ఇన్సూరెన్స్‌, పర్మిట్‌, అటెండర్‌ లేని బస్సులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వెంట పడుతున్నాడని.. చంపేశారు

- మద్యం తాగించి కొట్టిన వైనం
- నిందితుల రిమాండ్‌
- వివరాలు వెల్లడించిన త్రీటౌన్‌ సీఐ


వివరాలు వెల్లడిస్తున్న త్రీటౌన్‌ సీఐ విద్యాసాగర్‌

సిద్దిపేటఅర్బన్‌: అడ్డా కూలీని కొట్టి చంపిన హత్య కేసులో పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈనెల 8న రంగధాంపల్లి పరిధిలోని మయూరి దాబా వెనక ఖాళీ స్థలంలో బోదాసు నర్సింహులు హత్యకు గురైన విషయం తెలిసిందే. గురువారం పోలీస్‌ స్టేషన్‌లో త్రీటౌన్‌ సీఐ విద్యాసాగర్‌ కేసు వివరాలు వెల్లడించారు. పట్టణంలో నివాసం ఉండే గ్యాదరి శ్రీదేవికి పెద్దపల్లి జిల్లా రత్నాపూర్‌కు చెందిన ఇట్టవేని సతీష్‌తో కల్లు దుకాణంలో పరిచయం ఏర్పడింది. ఇద్దరు చనువుగా ఉంటున్నారు. ఇదే క్రమంలో తొగుట మండలం పెద్ద మాసాన్‌పల్లికి చెందిన నర్సింహులు సైతం శ్రీదేవికి పరిచయం కాగా వెంటడేవాడు. దీంతో శ్రీదేవి విషయాన్ని సతీష్‌తో చెప్పింది. ఓ రోజు మద్యం తాగుతున్న సమయంలో శ్రీదేవికి సతీష్‌ పెళ్లి ప్రతిపాదన చేయగా ఒప్పుకుంది. కానీ, నర్సింహులు వెంట పడుతుండటంతో అతడిని అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 7న రాత్రి సిద్దిపేట పాత బస్టాండ్‌ వద్ద శ్రీదేవిని నర్సింహులు కలిసి కల్లు తాగుదామని పిలిచాడు.అదే సమయంలో సతీష్‌ కూడా వచ్చాడు. రంగధాంపల్లి వద్ద దావత్‌ ఉందని ముగ్గురం కలిసి వెళ్దామని నర్సింహులును శ్రీదేవి నమ్మించింది. అక్కడి నుంచి వెళ్లి ముగ్గురు కలిసి మద్యం తాగారు. పథకం ప్రకారం గొడవపడి సతీష్‌ నర్సింహులును ఛాతీపై, ముఖంపై పిడి గుద్దులు గుద్ది, తల వెనక భాగంలో కొట్టగా మృతి చెందాడు. కేసును ఛేదించిన త్రీటౌన్‌ సీఐ విద్యాసాగర్‌, సిబ్బందిని ఏసీపీ రవీందర్‌రెడ్డి అభినందించారు.

షేర్‌ మార్కెట్‌ పేరుతో సైబర్‌ మోసం

తూప్రాన్‌: షేర్‌ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని నమ్మబలికిన సైబర్‌ నేరగాళ్లు వ్యక్తి నుంచి రూ.లక్ష కాజేశారు. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం... పట్టణానికి చెందిన వ్యక్తి ప్రైవేట్‌ ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల 13న తన ఫోన్‌కు టెలిగ్రాం ద్వారా హర్ష్‌ భగత్‌ అనే గ్రూపులో షేర్‌ మార్కెట్‌ గురించి మేసేజ్‌ వచ్చింది. ఇందులో రూ.10 వేలు పెట్టుబడి పెడితే రూ.75 వేల లాభం వస్తుందని మేసేజ్‌ పెట్టారు. దీనికి ఆకర్షితుడైన ఆ వ్యక్తి తన బ్యాంకు ఖాతా ద్వారా రూ.10 వేలు పంపించాడు. వెంటనే ఫోన్‌కు రూ.99 వేలు వచ్చాయని ఫొటో పంపించారు. పలు దఫాలుగా రూ.19 వేలు, జీఎస్టీ కోసం మరో రూ.29 వేలు పంపమని కోరడంతో నిజమేనని నమ్మి పంపించాడు. సేవింగ్‌ ఖాతా ఉంటే డబ్బులు తీసుకోలేరని, కరంటు అకౌంట్‌ ఉంటేనే తీసుకోవచ్చని సూచించారు. వారు చెప్పినట్లుగానే రూ.40 వేలు పంపించాడు. మరికొన్ని డబ్బులు పంపించాలని చెప్పడంతో మోసపోయానని గ్రహించి సైబర్‌ క్రైమ్‌ టోల్‌ ఫ్రీ నంబర్‌ 1930కు కాల్‌ చేసి ఫిర్యాదు చేశాడు.

మహిళలకు తోడుగా సఖీ సెంటర్‌

సిద్దిపేటకమాన్‌: మహిళలకు తోడుగా సఖీ సెంటర్‌ సేవలు అందిస్తున్నామని సిద్దిపేట సెంటర్‌ అధికారి ప్రతిమ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో సఖీ సెంటర్‌ ఏర్పాటు చేసి ఆరేళ్లు పూర్తి చేసుకున్నదని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 1,535 కేసులు నమోదు కాగా వీటిలో 868 గృహ హింస, 111 వరకట్నం, 112 చీటింగ్‌ లవ్‌ కేసులు, 144 మిస్సింగ్‌, 58 పోక్సో, 23 బాల్య వివాహాలు, 219 ఇతర కేసులు నమోదయ్యాయని చెప్పారు. వీటిలో 1,387 కేసులు పూర్తి స్థాయిలో పరిష్కరించినట్లు చెప్పారు. 1,523 మందికి కౌన్సిలింగ్‌ నిర్వహించి మనోధైర్యం నింపినట్లు, మరో 148 కేసులు పరిశీలనలో ఉన్నాయన్నారు. 647 మందికి న్యాయ సలహాలు అందించడంతో పాటు 308 మందికి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం, 197మందికి పోలీసు సపోర్టు ఇప్పించామని తెలిపారు. సెంటర్‌లో పూర్తి స్థాయి సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

దొంగతనానికి వెళ్లి సెక్యూరిటీ గార్డు హత్య

- ఆరుగురు నిందితుల రిమాండ్‌
- పరారీలో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రభాకర్‌

పటాన్‌చెరుటౌన్‌: దొంగతనానికి వెళ్లి సెక్యూరిటీ గార్డును హత్య చేసిన నిందితుల్లో ఆరుగురిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ ప్రభాకర్‌ కేసు వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన కైరత్‌మియా (53) పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని ఉష మాగ్‌ వైర్స్‌ ఇండియా ప్రయివేట్‌ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ ఇస్నాపూర్‌లో ఉంటున్నాడు. అయితే బొంతపల్లికి చెందిన పెయింటర్లు బిట్టు, మహమ్మద్‌ మాజీద్‌, రోషన్‌ కుమార్‌, మహమ్మద్‌ సద్దాం, వికాస్‌ కుమార్‌, నర్సింగరావు, వినీత్‌ కుమార్‌తో పాటు ఓ బాలుడు కలిసి పని చేసే చోట క్రికెట్‌ ఆడేవారు. ఈ నేపథ్యంలో పరిచయం ఏర్పడి మద్యం తాగుతూ జల్సాలకు అలవాటుపడ్డారు. పనిచేస్తే వచ్చే డబ్బులు జల్సాలకు సరిపోవడం లేదని, దొంగతనం చేద్దామని పథకం రచించారు. ఈ క్రమంలో ఏప్రిల్‌ 16న అర్ధరాత్రి ఉష మాగ్‌ వైర్స్‌ కంపెనీలో కాపర్‌ వైర్‌ దొంగిలించే ముందు మద్యం తాగారు. ప్లాన్‌ ప్రకారం బొలెరో వాహనం, నంబర్‌ప్లేట్‌ లేని ద్విచక్ర వాహనం తీసుకుని 8 మంది దొంగతనానికి వెళ్లారు. దొంగతనం చేస్తున్న క్రమంలో సెక్యూరిటీ గార్డు కైరత్‌ మియా గమనించి టార్చ్‌ వేసి చూశాడు. దీంతో అతడి తలపై కర్రలతో కొట్టడంతో గట్టిగా అరిచాడు. స్థానికంగా ఉన్న లేబర్‌ రావడంతో అక్కడి నుంచి అందరూ పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన సెక్యూరిటీ గార్డును పటాన్‌చెరులోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఏప్రిల్‌ 23న మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక పోలీసులు, సీసీఎస్‌ పోలీసులు దర్యాప్తులో భాగంగా మొబైల్‌ ఫోన్లు,. సీసీ కెమెరాలు పరిశీలించి రోషన్‌ కుమార్‌ని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుల వివరాలు వెల్లడించాడు. బాలుడు, బిట్టు అనే నిందితులు పరారు కాగా, మిగతా వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన వాహనం, సెల్‌ఫోన్‌లు, కర్రలను స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించిన సీసీఎస్‌ సీఐ శివకుమార్‌, బీడీఎల్‌ సీఐ స్వామి గౌడ్‌, సీసీఎస్‌ సీఐ –2 రామానాయుడు, ఎస్‌ఐలు శ్రీకాంత్‌, లక్ష్మారెడ్డి, మహేశ్వర్‌ రెడ్డి తోపాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి

వికసిత్‌ కృషి సంకల్ప అభియాన్‌లో శాస్త్రవేత్తలు


సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

కొల్చారం(నర్సాపూర్‌): రసాయన ఎరువులతో నిస్సారంగా మారుతున్న నేపథ్యంలో భూములను కాపాడుకునేందుకు రైతులు వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. గురువారం మండలంలోని సంగాయిపేట గ్రామంలో ఫార్మర్‌ ప్రొడ్యూసర్‌ ఆర్గనైజేషన్‌, కృషి విజ్ఞాన కేంద్రం తునికి ఆధ్వర్యంలో వికసిత్‌ కృషి సంకల్ప అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏటీఏఆర్‌ఐ జోన్‌–గీ డైరెక్టర్‌ డా.షేక్‌ ఎన్‌ మీరా మాట్లాడారు. ముఖ్యంగా రైతులు సేంద్రియ ఎరువుల వాడకం, ప్రత్యామ్నాయ పంటల ద్వారా అధిక దిగుబడి సాధించి, ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన సాంకేతికతను అందించడమే ప్రధాన అంశంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అనంతరం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. ప్రస్తుతం అనుకూలంగా ఉన్న రంగంలో రాణించేందుకు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు రైతులు వ్యవసాయంలో తమకు ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకురాగా సలహాలు, సూచనలు అందించారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు తెగుళ్లను తట్టుకొని, అధిక దిగుబడులను ఇచ్చే కొత్త వంగడాలను వృద్ధి చేసి రైతులకు అందించాలన్నారు. మార్కెట్లో వందల్లో విత్తన రకాలు ఉండటంతో ఎన్నుకునే విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ రంగ వ్యవసాయ విత్తనోత్పత్తి ద్వారా విత్తనాలను రైతులకు అందించాలని శాస్త్రవేత్తలు కోరారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్‌ వికే.సింగ్‌ , మహేందర్‌ కుమార్‌, ఆర్‌.డి ప్రసాద్‌, గంగయ్య, సురేష్‌ కుమార్‌, కృష్ణ, ఎస్‌.డి నల్కర్‌, కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్త ప్రతాపరెడ్డి, ఎఫ్‌పీఓ చైర్మన్‌ వెంకట్‌ రెడ్డి , రైతులు శ్రీనివాస్‌ రెడ్డి, నరేందర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.